

**సాయంత్రం** నాలుగు గంటలు కావచ్చింది.

కారుమబ్బులు నలు దిక్కుల నుండి గాఢంగా కమ్ముకుంటున్నాయి. సుడిగాలి మింటికి ఎగసి దుమ్ము రేపుతున్నది. పొడవుగా పెరిగిన చెట్లు వెంట్రుకలు విరబోసుకుని పూనకం పట్టిన వడుచు దానిలా అర్థంలేకుండా అర్ధవృత్తం తిరుగుతున్నాయి.

వెలుపల వాతావరణం భయంకరంగా ఉంది.

ఆరోజు కోకిల నా జీవితంలోంచి వెళ్ళిపోడానికి ప్రయత్నాలు చేస్తూ మా ఇంటిలో ప్రళయాన్ని సృష్టించింది. బయట వాతావరణం నా అంతరంగంలో జరుగుతున్న అలజడికి ప్రతిబింబంలా ఉంది.

కోకిల వెళ్ళవలసిన రైలు సరిగ్గా ఐదు గంటలకు బయలు దేరుతుంది. సూట్‌కేస్ సర్దుకుని సిద్ధంగా నిలబడింది కోకిల. గదిలో వెలుగుతున్న దీపపు కాంతిలో నల్లరాతి విగ్రహంలా మెరుస్తూ, పిడికిళ్ళు బిగించి పొంగుతున్న దుఃఖం ఆపుకోవాలని మింగుడు పడనట్లు గుటకలు బలవంతంగా మింగుతూ, ఎలాగో అన్నది—

"వె...వె...వెళ్ళిరానా?..."

ప్రొద్దుట కోకిల చెప్పినదానికి సరైన జవాబు దొరక్క—దొరక్క కాదు. సూటిగా, నిష్కల్మషంగా తన ప్రశ్నలకు జవాబు చెప్పలేక మూగపోయిన నేను బరువుగా తల ఎత్తి కోకిలను చూశాను. కోకిల నా రక్తం పంచుకుని పుట్టలేదు. అయినా రక్తంకన్నా ఎక్కువనుకున్న అనుబంధం నన్ను విడిచి వెళ్ళనున్నది !

"నువ్వు ఎక్కడికీ వెళ్ళడానికి వీలులేదు!" హఠాత్తుగా ఉరుముకంటే పెద్దగా ఘర్జించాను.

నా అరుపుకు అదిరిపోయింది కోకిల.

ఆవేశంగా పైకిలేచి ఎగిరిపోతున్న పిట్టను పట్టుకోబోతున్నట్లు కోకిలమీదకు ఉరకబోయాను! కిటికీ రెక్కలు దబాలున తెరుచుకుని లోనికి రయ్‌మంటూ ఈదురగాలి...గాలితో పాటు వర్షధార విరుచుకుంటూ వచ్చి మా ఇద్దరిమీద పడ్డాయ్!

జిల్లుమంది నా శరీరం.

బయట కుండపోతలా వర్షం? నాకు ఇరవై ఏళ్ళ క్రితం జరిగిన సంఘటన గుర్తుకు వచ్చి, వెచ్చదనంకోసం నా చేతులు రెండూ ఆప్యాయంగా చాపాను ! నా కౌగిలిలోకి వచ్చి ఇమిడి పోయింది కోకిల.

నేను కోకిలకు కన్నతండ్రి కాను కాపీ...

● ● ● ●

ఆరోజు కూడ ఇలాగే కుండపోతలా వర్షం కురిసింది. పెనుభూతం వెంటాడుతున్నట్లు హోరుమని గాలి. ప్రకృతి బాధతో వంకరలు తిరిగి పోతున్నట్లు మూలుగులాంటి శబ్దం!

ఎవరో పుణ్యాత్ముడు దారే పోయే బాటసారుల కోసరం బస్‌స్టాండు ప్రక్కనే డబ్బారేకుల షెడ్ కట్టించాడు. అందులో మూలను నక్కి బస్సుకోసం రెండు మూడు గంటలనుండీ ఎదురు చూస్తున్న నేను—వెచ్చదనంకోసం ఎన్నో సిగరెట్లు ముట్టించాను. ఉరుములు ధబ ధబమంటున్నాయి. చెట్ల కొమ్మలు ఫెళఫెళమంటూ విరిగి క్రింద పడుతున్నాయి. నాలో ఎన్నడూ లేని భయం పట్టుకుంది. ఒంటరితనంలో పిరికితనం ఆవరించి అడ్డమైన ఆలోచనలూ రాసాగాయి. నేను తెచ్చుకున్న ట్రాన్సిస్టర్ రేడియోలో విన్న— "బంగాళాఖాతంలో నుడిగుండం" ఏర్పడిన మాట గుర్తుకు వచ్చి ప్రక్కనే సముద్రుని ఘోష వింటూ ఉంటే నా ఆరాటం మరీ ఎక్కువైంది...

నా కిప్పటికి ముప్ఫయిరెండేళ్ళు. గడచిన ఆరేళ్ళుగా అనూరాధతో నా సంసారం సుఖంగా సాగిపోతున్నది. మాకు ఇద్దరు మగపిల్లలు. ఆ క్షణం వాళ్ళకు నేను ఏమీ కాకపోతానా అన్న భయంతో గడ గడ వణికిపోయాను. నెత్తిన పిడుగుపడినా, చెట్టు విరిగి మీద పడినా, వరదవచ్చి కొట్టుకుపోయినా— దిక్కులేని ఆ వూరుకాని వూరులో దిక్కులేని ఆ వూరుకాని వూరులో నస్తే వాళ్ళ

కొరకు నడుపుతున్న కుటుంబ నియంత్రణ కేంద్రం ఎలా నడుస్తుందో చూడడానికి వచ్చిన నాకు—గత మూడు రోజులనుంచీ వాతావరణంలో వస్తున్న మార్పులకు దిగులుగానే ఉంది. దానికి తోడు అక్కడివాళ్ళు "నిరుడు గాలి వానకు బాబుగారూ! అలలు ఆకాశాన్ని అందుకుంటున్నంత ఎత్తు ఎగిరి పడ్డాయి. పెద్ద పెద్దకొబ్బరి చెట్లే విరుచుకుపడిపోయాయి. మేమంతా అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకుని తెల్లవార్లూ భజనలు చేశాము" అని చెబుతుంటే అక్కడ నిలబడలేక త్వరత్వరగా నాగరికతని చేరుకోవాలని సూట్‌కేసు చేత పుచ్చుకుని బస్‌కోసం హడావిడిగా బయలుదేరి వచ్చాను. దారిలోనే ఎదురైంది సుడిగాలి— గాలితోపాటు కుంభవృష్టి.

రేకుల షెడ్‌లోకి తీవ్రమైన గాలి, గాలితో పాటు వర్షధార ఉండీ ఉండీ వచ్చి మీదపడి ఆరిపోతున్న నా బట్టల్ని మళ్ళీ మళ్ళీ తడి చేస్తున్నాయి. చలిలో గడగడ వణికిపోతూ బస్సుకోసం, వంకరలు తిరుగుతున్న రోడ్డు వైపు మరోసారి తల బయటకు దూర్చి ఆశగా చూశాను. హఠాత్తుగా రోడ్డు మీద వెదురుబద్దలా ఇటూ అటూ వూగిపోతున్న మరో ప్రాణి రూపం కనిపించి నాకు ప్రాణం లేచివచ్చినట్లయింది. నల్లగా అతి మెల్లగా కదలుతూ దావుకు వచ్చి

# కోకిల

ఉమ

నిలబడింది ఆ రూపం.

ఆశ్చర్యం! అదొక స్త్రీ రూపం.

నవమాసాలు నిండిన గర్భాన్ని చేతులతో పిండు కుంటూ విశ్వ ప్రయత్నంతో తన శరీరాన్ని ముందుకు లాక్కు వచ్చినట్లుంది. బావలా ఉన్న కడుపు తప్ప ఆమె శరీరం ఒక అస్థిపంజరంలా ఉంది. నన్ను చూసి చేయి చాపిం దా ప్రాణి. అప్రయత్నంగా చేయి అందించి ఆమెను అందు కున్నాను. ఆమె షెడ్‌లో అడుగుపెట్టి తూలుతూ వచ్చి నా మీద వాలిపోయింది. అనుకోకుండా మీదపడిన బరువుకు సంబాళించుకోలేక నేలకు ఒరిగిపోయాను. నా ఒడిలో వెచ్చగా మిగిలిపోయిం దా స్త్రీ.

కొన్ని క్షణాలు అర్థంలేకుండా గాలిలో కలసి పోయాయి. కాసేపటికి తేరుకుని, "బాబుగారూ!" అంటూ పెదవులమీద చిరునవ్వుతో ఆప్యాయంగా పలుకరించింది.

ఆ భయంకరమైన పరిస్థితుల్లో, ఆ వింత పరిసరాలలో నా ఒడిలో తల ఆనించి పరిచితు రాలిలా నా ఒడిలో పడుకుని ఉన్న ఆ స్త్రీ నాకు ఏమీ కాదన్న తలపు నాకు రాలేదు. తడసిన బట్టల్లో ఒణికిపోతున్న నాకు కుంపటి వెలిగించి నంత వెచ్చదనం దొరికి ఆమెకు నా ఒడిలో మరి కాస్త చోటు ఇచ్చాను!

పాపం, ఆమెకు తీవ్రమైన ప్రసవవేదన ప్రారంభమైంది? నా రెండు చేతులూ తన పిడి కళ్ళలో బిగించి గిలగిలా కొట్టుకుంది.

"పిచ్చిదానా! ఈ గాలి వానలో...ఒంటరిగా... ఈ పరిస్థితిలో ఎందుకు వచ్చావు?" ఫూరడింపుగా అన్నాను.

"దిక్కులేని దానిని, బాబూ! మీ ఒడిలో చోటు దొరికింది...ఈ భాగ్యమైనా నాకు దేవుడు కలి గించాడు." ఉండీ ఉండీ వస్తున్న నొప్పుల మధ్య పెదవులు కదిలిస్తూ అన్నది.

ఆమెకు మరి కాస్త వెచ్చదనం ఇవ్వాలని ఆమె తల నిమిరాను. ఆకాశంలో తళుక్, తళుక్‌మంటున్న మెరుపు తీగెలు కళ్ళలోకి వచ్చి పొడుచు కుంటున్నాయి. హఠాత్తుగా కెవ్‌మని కేక వేసింది నా ఒడిలో స్త్రీ!

అప్రయత్నంగా నా రెండు చేతులు ఆమెను గట్టిగా చుట్టేశాయి. అలా ఎంతసేపు మిగిలి పోయానో చెప్పలేను. ఆమె గుండెలూ, నా గుండెలూ దడదడా కొట్టుకుంటున్నాయనుకున్నాను. ఎక్కడో పాపాయి ఏడుపు వినిపించి ఈ ప్రపంచం లోకి వచ్చిపడ్డాను.

గడ్డలు గడ్డలుగా కనిపిస్తున్న రక్తపు మడు గులో కదలిక కనిపించి అదిరిపడ్డాను. కానీ, ఆ పసిగుడ్డుకు జననం ఇచ్చిన ఆ మాతృ మూర్తిలో చలనం కనిపించలేదు. ఆమె గుండె లకు నా చెవులు ఆనించి విన్నాను. నా గుండె మాత్రం దడదడా కొట్టుకుంటూంది. ఆమెది ఎప్పుడో ఆగిపోయింది.

గబ గబ పైకిలేచి షేవింగ్ కిట్‌లోంచి బ్లేడు తీశాను. ఎన్నో కాన్పుల అనుభవం ఉన్న మంత్ర సానిలా పని ముగించి పసిపాపను నా తుండుగుడ్డలో వెచ్చగా చుట్టి మూలను పెట్టి, వర్షపు నీటితో నా చేతులు కడుక్కుని నిలబడ్డాను! ఎర్రటి నీటి మట్టంలో నా ప్రతిరూపం నా కంటికి వింతగా కనిపించింది.

ఇదే జననం!

ఇదే మరణం!

ఈ రెండిటి మధ్యా ఇరుక్కున్న నేను—ఎవరు? సృష్టికర్తను కాదా? మరునాడు తెల్లవారుతుండగా వర్షం తగ్గింది. పసిపాపను వెచ్చగా నా హృద యానికి హత్తుకుని, ఒక చేత్తో మాట్‌కేసు పట్టుకుని పరుగులాంటి నడకతో నాగరికతని చేరుకున్నాను.

అలా ఇరవైఏళ్ళ క్రితం మా ఇంటికి వచ్చి చేరింది కోకిల. ఆడపిల్లకోసం తహ తహలాడి పోతున్న అనూరాధ—పసిపాపను చూసి సంబరపడి పోయింది. నల్లగా కారుమబ్బులా ఉందని నా పెద్ద కొడుకు రాజేష్ అప్పటికి ఐదేళ్ళవాడు—

"దీనికి 'కాకి' అని పేరు పెడదాం" అన్నాడు.

"ఛా! తప్పుకదూ! ఇది నీ చెల్లెలు" అని గుర్తు చేసింది అనూరాధ.

"ఛీ! కానేకాదు! దీన్ని నాన్న బజారులో కొనుక్కువచ్చారు!" దృఢంగా అన్నాడు రాజేష్.

"ఇది నా పాపాయిరా!" అని చెప్పింది అనూరాధ.

"పక్కింటి ఆంటీకి మొన్న పాపాయి పుట్టి నప్పుడు ఆంటీ ఆస్పత్రిలో చేరింది. మరి నువ్వు చేరలేదుగా!" ఐదేళ్ళ రాజేష్ సర్వం తెలిసిన వాడిలా మాట్లాడుతూ ఉంటే ఆశ్చర్యపోయాను.

ఈశ్వర్—మా చిన్నాన్న కొడుకు వాడు పుట్టిన సంవత్సరానికి వాడి తల్లి తండ్రులు హఠాత్తుగా పోయారు. వాడొక దిక్కులేనివాడైనాడు. మా పెళ్ళికాగానే ఈశ్వర్‌ను పెంచడానికి సిద్ధమైంది అనురాధ. అప్పటినుండీ వాడు మా దగ్గరే పెరిగాడు. కోకిల మా ఇంట్లో ప్రవేశించే వేళకు ఈశ్వర్‌కు పది సంవత్సరాలు. వాడు ఆ రోజు స్కూలునుండి రాగానే ఉయ్యాల తొట్టిలో ఊగుతున్న పసి పాపకేసి అదోలా చూసి, "ఇది ఎక్కడనుంచి వచ్చింది?" అని అడిగాడు.

"నాన్న బజారులో కొనుక్కు వచ్చారు. దీనిపేరు కాకి!" అని పరిచయం చేశాడు రాజేష్.

వారి సంభాషణ కుతూహలంగా విన్నాడు నా రెండో పుత్రరత్నం రెండేళ్ళ చేతన్. వాడితోపాటు నేనుకూడా.

"కాకి? ఛా! అదేం పేరు? బాగాలేదు!" అని కొట్టిపారేశాడు ఈశ్వర్.

"నల్లగా ఉందిగా?" పెదవి విరిచి అన్నాడు రాజేష్.

"కోకిల కూడా నల్లగా ఉంటుంది తెలుసా?" అని చెప్పాడు ఈశ్వర్.

"ఐతే?"

"దీనిపేరు కోకిల."

ఈశ్వర్ తెలివికి మేమంతా మెచ్చుకున్నాం. పాపకు కోకిల అన్న పేరు సార్థకమైంది.

"ఈ విషయం మీకు తెలుసా—కోకిలను దాని తల్లి ఎన్నడూ పెంచదు. అది ఎప్పుడూ పరుల గూట్లో పెరుగుతుంది" అని పిల్లలకి చెప్పింది అనూరాధ.

"దీనిలాగే!" అన్నాడు రాజేష్.

"మరో విషయం చెప్పనా?" అన్నాను నేను.

అందరూ నా కేసి కుతూహలంగా చూశారు.

"కోకిల పరుల గూట్లో పెరుగుతూ మిగత పిల్లల్ని క్రిందకు తోసేసి గూడంతా తనే ఆక్ర మించుకుంటుంది" అన్నాను.

"నిజమా?" అంటూ ఆశ్చర్యపోయింది అనూ రాధ.

పిల్లలు కోకిల కేసి అనుమానంగా చూశారు!

కోకిలకు ఆరేడు మాసాలు నిండేంతవరకూ పిల్లలు ఎవరూ దానిని ముట్టుకోలేదు. కానీ నెలలు నిండుతున్న కొద్దీ కోకిల ముద్దుగా తయారైంది. కళ్ళలో తీవ్రమైన కళ ఉట్టిపడుతూ ఉండేది. ఇరుగూ పొరుగూ కోకిలను ఎత్తుకుని తిరగడం,


ముద్దాడడం మొదలుపెట్టారు. కోకిల పావులారిటీ రోజుకు రోజు పెరుగుతున్నదని మొదట గ్రహించిన వాడు చేతన్. ధావితో బుద్ధిగా సాహాహం కలిపి ఆడు కోవడం మొదలుపెట్టాడు. ఆ తరవాత కోకిలను భుజాల మీద ఎత్తుకుని గుర్రం ఆట ఆడుకునే వాడు ఈశ్వర్. వీళ్ళిద్దరిలో కలిగిన మార్పులు చూసి రాజేష్ కూడ మనస్సు మార్చుకున్నాడు.

కోకిల ముద్దుగా నవ్వుతూ, శ్రీవమ్మైన కళ్ళతో చూస్తూ మా అందరి హృదయాల్లో ప్రత్యేకస్థానం ఆక్రమించుకున్నది. కాలప్రవాహంలో సంవత్సరాలు కలిసిపోతూ ఉంటే కోకిల పెరిగి పెద్దదై అందంగా తయారయింది.

"బ్లాక్ బ్యూటీ!" అంటూ గర్వంగా పిలిచేవాడు ఈశ్వర్.

"వెన్నెలరాతిబొమ్మ" అంటూ ముద్దుగా పిలిచే వాడు రాజేష్.

"కుక్కూ!" అంటూ అల్లరిచేస్తూ పిలిచేవాడు




చేతన్.

ముగ్గురు మగపిల్లలూ కోకిలను కంటికిరెప్పలా కాపాడుతారు. మా జీవితాల్లో తియ్యతియ్యగా ఇరవై యేళ్ళు దొర్లిపోయాయి. అప్పటికి కోకిల ఎమ్. ఎ. లిటరేచర్ చదువుకుంటున్నది. జర్నలిస్టు కావాలని గాఢమైన కోర్కె ఉన్నట్లు నాతో చెప్పుకుంది. ఈశ్వర్ ఎమ్. డి. పూర్తిచేసి ప్రాక్టీసు పెట్టు కున్నాడు. రాజేష్ ఇంజనీరింగ్ పూర్తిచేసి ఉద్యోగంలో చేరాడు. చేతన్ క్రికెట్ ఆటగాడైనాడు. బి. ఎ. పూర్తిచేసి బాంకులో ఉద్యోగం సంపాదించు కున్నాడు. వీళ్ళు ముగ్గురు తల్లిచాటున పిల్లలై కోకిల చుట్టూ జట్టుగా తిరుగుతూ మిగత స్త్రీ జాతిని పూర్తిగా మరిచిపోయారు!

సుఖ దుఃఖాలు వెలుగు నీడల్లా మనిషి జీవితంలో దాగుడు మూతలు ఆడుకుంటాయని నాకు తెలుసు. కానీ భగవంతుడు మా కిచ్చిన వెలుగు చాలన్నట్లు అనూరాధను హఠాత్తుగా తీసుకువెళ్ళిపోయినప్పుడు నేను నేర్చుకున్న వేదాంతం పనికిరాలేదు. నేను అనురాధ వియోగంతో పిచ్చివాణ్ణయిపోతా నను కున్నాను. మా ఇల్లు చీకటిలో కలిసిపోయి, శోక సముద్రంలో మునిగిపోయింది. మగ పిల్లలుముగ్గురూ తిండీ తిప్పలు తినకుండా మంచాల కంటుకు పోయారు.

మహావృక్షం నీడలో చల్లగా బ్రతుకుతున్న మాకు—అనూరాధ నిష్క్రమణతో ప్రపంచం తల క్రిందులైనట్లనిపించింది. అనూరాధ సంరక్షణలో ఒళ్ళు తెలియకుండా బ్రతికిన మాకు ఇంక మీదట జీవితం శూన్యం అనిపించింది.

ఆ ఇంట్లో ఆరిపోయిన దీపానికి నూనె పోసి మళ్ళా వెలుగు తీసుకు వచ్చింది కోకిల. మా అందరినీ పసిపిల్లల్లా లాలించి అన్నంపెట్టి తీపి తీపి కబుర్లు చెబుతూ మంత్రముగ్ధుల్ని చేసింది. మేము కోకిల సంరక్షణలో అనూరాధను మరిచి మామూలు మను ష్యులం కాగలిగాము.

కొన్ని నెలల తర్వాత కోకిల హఠాత్తుగా అలసి పోయి—"నాన్నా! మీతో ఒక మాట చెప్తాను. ఈశ్వర్‌కూ, రాజేష్‌కూ వివాహం చేయకపోతే నేను ఒక్కదాన్నీ ఈ ఇంటి భారం మోయడం కష్టం!" అని నాతో అన్నది.

నిగ్గేసింది.

"నన్ను క్షమించు, కోకిలా? అంతా నీనెత్తి మీద పడేశాను కద్దు? ఇంక మీదట ఇలా జరగనివ్వను. త్వరలో ఈశ్వర్ పెళ్ళి చేసుకుంటే ఈ ఇంటికి చిన్న వదిన వస్తుంది. అప్పుడు నీకు కాస్త రిలీఫ్!" అన్నాడు.

అనురాధ బ్రతికి ఉండగా ఈశ్వర్‌కు వివాహం చేయాలని ఎన్నోసార్లు ప్రయత్నాలు చేసి విర మించుకుంది. ఎమ్.డి పూర్తి కావాలని ఖచ్చితంగా చెప్పేవాడు. తీరా అది పూర్తి అయినాక బాగా డబ్బు సంపాదించాలని మరో వాయిదా వేశాడు.

పెళ్ళి కాగానే విడిగా కాపురం పెట్టాలని నేను మగ పిల్లలకు షరతు పెట్టాను. అదివాళ్ళకు ఇష్టంలేకపోయింది.

"మీలో మీరు మనమంతా ఒకటేనని ఎన్ని మాటలు అనుకున్నా—ఆ వచ్చే పిల్ల పరాయిది అని గుర్తు పెట్టుకోండి. రానున్న ఆ అమ్మాయికి విడిగా ఉండాలని ఉంటుంది" అని నా వాదం.

నా వాదం అనురాధకు కూడ నచ్చలేదు. ఈశ్వర్ నా షరతుకు భయపడి వివాహం వాయిదా వేస్తున్నా డని అనురాధ అనుకుంటూ ఉండేది.

ఆ సాయంత్రం ఈశ్వర్‌తో పెళ్ళి విషయం ప్రస్తావించాను.

"30 ఏళ్ళు వచ్చాయి. మంచి ప్రాక్టీసు కూడా ఉంది. ఇంకా ఎందుకు ఆలశ్యం? పెళ్ళి చేసుకుని సెటిల్ అవుతే బాగుంటుంది కదరా? వివాహం అనంతరం విడిగా కాపురం పెట్టాలని నా కిప్పుడు పట్టింపులు లేవు. ఈ ఇంటికి త్వరలో చిన్నవదిన రావాలని నా కోరిక" అన్నాను.

"నేను—నేను ఇంకెవర్నీ వివాహం చేసుకోలేను, అన్నయ్యా!" బాధగా అన్నాడు.

"నీ మాటలు సరిగా అర్థం కావడం లేదు."

"నేను—నేను . . .కో—కి—లను ప్రేమిస్తు న్నాను!" ప్రయత్నం మీద అన్నాడు ఈశ్వర్.

"కోకిలనా?" షాకైనట్లు చూశాను. నాకు చెమ టలు కూడా పట్టాయి.

"కోకిల మీ కూతురు అన్న దృష్టితో నేను ఎన్నడూ చూడలేదు. ఇందులో తప్పు లేదనుకుం టాను?" అపరాధిలా నిలబడి అన్నాడు ఈశ్వర్.

"నీ ఉద్దేశం కోకిలకు తెలుసా?"

లేదన్నట్లు తల అడ్డంగా ఆడించాడు.

"ఈ ఉద్దేశం ఈ మధ్యనే కలిగింది. వదిన చని పోయినాక నా దృష్టిలో కోకిల ఎంతో ఎత్తు ఎదిగిపోయింది. తనలో ఇంత శాంతం,సుగుణం ఉందని మొన్నమొన్ననే గ్రహించాను. కోకిల రూపంలో నాకు దేవత స్వరూపం కనిపిస్తూంది. తనని గుప్తంగా ఆరాధిస్తున్నాను — ప్రేమిస్తున్నాను."

ఇలా జరుగుతుందని నేను ఎన్నడూ వూహించ లేదు. ఏం చేయాలో తోచక అంతటితో పెళ్ళి ప్రస్తావన కట్టిపెట్టాల్సి వచ్చింది. వారం పది రోజుల అనంతరం రాజేష్ నా గదిలోకి హడావిడిగా వచ్చాడు.

"ఏమిటోయ్!"

"మీతో కొన్ని ముఖ్య విషయాలు మాట్లా డాలి!" నా కెదురుగా కూర్చుని అన్నాడు.

"ఏమిటది?" నా పిల్లలకు స్నేహితుడిగా మిగిలి పోవాలని వాళ్ళకు నా దగ్గర చాలా చను విచ్చాను.

"ఈశ్వర్ ఇంకెంతకాలం మన ఇంట్లో ఉండి పోతాడు?" హఠాత్తుగా అడిగాడు రాజేష్.

వాడి మాటలకు ఆశ్చర్యపోయాను.

"నీ మాటలు అర్థం కావడం లేదురా!"

"బాగా సంపాదించుకుంటున్నాడు. వేరే ఉండ మనకూడదూ?"

ఎవరో నా గుండెల్ని పైకి లాగి పిండినట్లు బాధపడ్డాను. నా చెవులు నేను నమ్మలేకపోయాను. ఈశ్వర్ లేనిదే క్షణం కూడ తోచని రాజేష్‌లో హఠాత్తుగా ఈ మార్పు ఎందుకు వచ్చిందో అంతు

విక్కలేదు. ఈశ్వర్ కోకిలను గుప్తంగా ప్రేమి స్తున్నమాట వీడికి తెలిసి అది తప్పుగా భావించి ఇలా అంటున్నాడా? నా మనస్సులో ఎన్నో ఆలోచ నలు గజిబిజిగా తిరిగాయి.

"ఈశ్వర్ పెళ్ళి చేసుకుని సెటిల్ ఆయ్యేంత వరకూ మన దగ్గరే ఉండిపోవాలని మీ అమ్మ కోరిక" అని బాధగా రాజేష్‌కు గుర్తు చేశాను.

"అయితే త్వరలో పెళ్ళి చేసుకుని ఈ ఇంట్లోంచి వెళ్ళమనండి!" దృఢంగా కఠినంగా అన్నాడు.

"మీరిద్దరు స్నేహితులు కదా? వాడి మన స్సులో ఏముందో మీకే తెలియాలి."

నా కళ్ళలోకి క్రూరంగా చూశాడు.

కోకిల ఎంతో ప్రయత్నం చేసి శాంతివనంలా చేసిన ఆ ఇంట్లో ఏదో అల్లకల్లోలం బయలు దేరుతున్నట్లు గ్రహించాను కానీ, అది ఫలాన అని వూహించలేకపోయాను. ఈశ్వర్, రాజేష్, చేతన్ ఒక్కటిగా కలిసి తిరిగేవారు. అలాంటిది రోజులు గడిచేకొలది ముగ్గురిలో వింత మార్పులు రాసాగాయి! ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం పూర్తిగా మానేశారు. పైగా ఒకరికొకరు విసురుగా సమా ధానాలు ఇచ్చుకోవడం మొదలు పెట్టారు. ఇంట్లో పరిస్థితి కోకిలకు కూడా అర్థం కాలేదు. ఆ ఇంట్లో ప్రేమ, అనురాగాలు భద్ర పరచడానికి సర్వశక్తులా ప్రయత్నించింది.

ఆ రోజు ఆదివారం. అందరం ఇంట్లోనే ఉన్నాము. దానికి తోడు ముసురు పట్టి ఉంది. చేతన్ కోకిలతో చిన్న పిల్లవాడిలా పోట్లాడుతున్నాడు. చివరకు మొరటుతనంలోకి దిగింది వాళ్ళ వాదం. కోకిలను గోడకు నొక్కి పట్టి బలవంతం చేశాడు చేతన్.

ఇదంతా పేపరు చదువుతూ గమనిస్తున్న ఈశ్వర్ సహించలేక "యూ బ్రూట్! లీవ్ హర్!" అంటూ గట్టిగా అరిచాడు.

ఈశ్వర్ అరుపుకు గాలి దుమారంలా గదిలోకి వచ్చాడు రాజేష్.

చేతన్ జబ్బ పట్టుకుని బలంగా వెనక్కు లాగాడు. ఇద్దరూ కింద పడ్డారు. అన్న దమ్ములు కింద మీదా పడి తన్నుకున్నారు. మొదట్లో ఇదంత తమాషాకు అనుకుని మెదలకుండా ఉండి పోయాను నేను.

ఇంతలో చేతన్ ముక్కులోంచి రక్తం కారింది. అదిరిపోయి "స్టాపిట్ యు టూ!" అంటూ గట్టిగా ఘర్జించాను నేను. నా ఘర్జనకు ఇద్దరూ దులుపు కుంటూ లేచి నిలబడ్డారు. కోకిల భయంగా గోడకు అంటుకు పోయి చూసింది. ఎర్రగా కందిపోతూ ముక్కులోంచి కారి పోతున్న రక్తాన్ని అరచేతితో తుడుచుకున్నాడు చేతన్. నా కేసి తీవ్రంగా చూచి, "నాన్నా! కుక్కా మీద నాకు సర్వ అధికారాలు ఉన్నాయని ఈ ఇంట్లో ఉన్నవాళ్ళ అందరికీ చెప్పండి. కుక్కా నాది.షి ఈజ్ మైన్!" ఆవేశంగా అన్నాడు చేతన్. నాకు వాడి మాటలు అర్థం చేసుకోవడానికి కొన్ని నిమిషాలు పట్టాయి. అంతలోనే చేతన్ గదిలోంచి వెళ్ళిపోయాడు.

నేను ఈశ్వర్ వైపు దృష్టి మరల్చాను. వాడు నా చూపు తట్టుకోలేనట్లు అక్కడ నుంచి అమాంతం లేచి అవతలకు వెళ్ళిపోయాడు.

రాజేష్ అక్కడి నిశ్శబ్దం భరించలేనట్లు, "విన్నా రుగా, నాన్నా! మా ముగ్గురిలో ఎవరితో జీవితం పంచుకోవాలని ఉందో కోకిలను అడగండి. ఈ నిర్ణయం...ఈ రోజు...ఈ క్షణమే తేలిపోవాలి" అన్నాడు.

వాడి మాటలకు తెల్లబోయి చూశాను.


రాజేష్ ఎక్కువ సేపు నా ఎదుట నిలబడ లేదు. వెళుతూ కోకిల భుజం గట్టిగా నొక్కి వెళ్ళి పోయాడు

హఠాత్తుగా కోకిల పిచ్చిదానిలా నవ్వడం మొదలు పెట్టింది.

"కోకిలా!"

"ఈ స్వయంవరంలో వాళ్ళతోపాటు మీరు కూడా నిలబడతారా?" నవ్వుతూనే అన్నది కోకిల. కోకిల మాటలు నాకు శూలం పోటులా తగిలాయి.

నేను బాధతో వంకరలు తిరిగి పోతున్నానని గ్రహించి ఉంటుంది. "నేను మీ రక్తం పంచుకుని పుట్టలేదుగా? అందుకే అడిగాను! తప్పా? అమ్మ




పోయాక అమ్మలా దగ్గర చేరి బుజ్జగించి ఒడిలో తల ఉంచుకుని పూరడించినందుకు, పక్కపక్కనే పడుకుని ప్రేమగా కబుర్లు చెప్పినందుకు, అన్నం ముద్దలు కలిపి నోటికి అందించినందుకూ— వాళ్ళు...వాళ్ళు నా కిచ్చిన శిక్ష విన్నారుగా? ఓహ్! నా ప్రేమ ఎంత అపవిత్రం చేశారు? వాళ్ళను స్వచ్ఛంగా తల్లిలా. సోదరిలా ప్రేమించినందుకు వాళ్ళు నా కిచ్చిన కానుక చూశారా? వాళ్ళ కంటికి నేనొక పరాయి స్త్రీలా కనిపిస్తున్నానా? నేను మీ కడుపున పుట్టలేదనీ, మీ రక్తం పంచుకోలేదనేగా వాళ్ళు ఇంత సాహసం చేసి ఇంత క్రూరంగా నిర్ణయం చేశారు! ఈ ఇంట్లో ఇరవయ్యేళ్ళు పెరిగిన తరవాత తొబుట్టువుగా నాకీ ఇంటో స్థానం లేదని, నన్ను మరో రూపం తీసుకోమని ఎంత తేలికగా చెప్పేశారు! వాళ్ళకు నేను పరాయి స్త్రీలా కనిపిస్తే మీ కంటికి మాత్రం మరో విధంగా ఎలా కనిపించ గలను! మీరుకూడా ఇవాళ కాకపోతే రేపు మీ మనస్సు మార్చుకోవచ్చు. మీరుకూడా వాళ్ళలా మారిపోవచ్చు. నాకీ ఇంట్లో స్థానం లేదు. నేను ఎవరికో దిక్కులేని దానికి పుట్టాను. ఎక్కడనుండి వచ్చానో అక్కడికే వెళ్ళిపోతాను." పిచ్చిదానిలా నవ్విన కోకిల చివరకు ఏడుస్తూ గదిలోంచి వెళ్ళిపోయింది.

ఆ గదిలో రాతి విగ్రహంలా నిగిలి పోయాను నేను.

● ● ● ●

నా కౌగిలిలో గాఢంగా వచ్చి ఇమిడి పోయింది కోకిల. కోకిల తల భారంగా నిమిరాను.

"నా మీద పూర్తి నమ్మకం ఉంది కదూ?"

"నా...న్నా!"

ఆ పిలుపుకు తృప్తిగా వూపిరి పీల్చాను.

"కోకిలా! నువ్వు నా రక్తం పంచుకుని పుట్టని మాట నిజమే కావచ్చు కానీ, నీ జననంలో నా పాత్ర ఎంత ప్రాముఖ్యమైనదో మీ అమ్మకూ, నాకూ తప్ప ఇంకెవరికీ తెలియదమ్మా! మామూలుగా తన దారిన తాను పోతాడు పురుషుడు. ఆ తరవాత నవమాసాలు తన గర్భంలో మోసి ఆ శిశువుకు జన్మ ఇస్తుంది తల్లి. 'నా రక్తం పంచుకుని పుట్టిన బిడ్డ' అనుకుంటూ ఆ బిడ్డను మళ్ళీ వచ్చి సాకుతాడు మగవాడు.

నీ విషయంలో. నేను మీ అమ్మలో సృష్టి కార్యంలో పాల్గొనలేదు కానీ, నీకు జన్మ ఇచ్చిన తల్లితోపాటు ఆమె ప్రసవవేదన పంచుకున్నాను. ఆ నాడు ఆ పరిస్థితుల్లో మే మిద్దరమూ ప్రకృతిలో లీనమై పోయి నీకు జంటగా జన్మ నిచ్చాము. కోకిలా! మీ అమ్మ ప్రాణం గాలిలో కలిసిపోయినాక ఆమె స్థానంలో నేను నిలిచాను! నువ్వు నా బిడ్డవు, కోకిలా? రాజేష్, చేతన్ నా రక్తం పంచుకుని పుట్టిన బిడ్డలు కావచ్చు కానీ, నువ్వు అంతకంటే ఎక్కువే నాతో పంచుకుని పుట్టిన దానవు! ఇంట్లో కలకాలం ఉండి పోవలసిన హక్కు మొదట నీకే ఉంది.

ఒక చెల్లిని, ఒక అన్న కూతుర్ని పరాయి స్త్రీలా ప్రేమించినందుకు వాళ్ళకే శిక్ష పడాలి. ఈ ఇంట్లో వాళ్ళకే స్థానం లేదు. వాళ్ళు ముగ్గురూ వెంటనే బయటకు వెళ్ళి పోవాలని చెబుతాను."

"నాన్నా!"

*